కథానిక

# బానిసల స్వేచ్ఛ

— చింతా శ్రీరామచంద్రమూర్తి

రాత్రి పడింది. ఆరోజున మా అత్తయ్య అన్నం చప్పున వార్చింది. భోజనం ముగించి పడక గదిలోకి వెళ్ళాను. దీపం మసగ్గా వెలుగుతోంది. కొంచెం హెచ్చుచేశాను. పాపక్లేశం నించి బయటకు రావడానికై పెనుగులాడుతున్న మానవుడికి ముక్తిపథం కనపడినట్టుగా గది అంతా వెలుగుతో నిండింది. బల్లమీద సగం చదివిన భారతంలోని పేజీలు గాలిలో టపటప కొట్టుకుంటున్నాయి. కుర్చీలో కూర్చున్నాను. ద్రౌపది కంటపడింది. కంటకొట్టుకే కణతమీంచి రక్తం కారుతోంది. భారతం పూర్తిచేద్దామనుకున్నాను.

కాని మనస్సుకి ఆలోచనలు అడ్డుపడ్డాయి. చదువు ఆపుచేశాను. మనస్సు గాలిలోకి పరుగు పెడుతోంది. గది అనే బందిఖానానించి స్వేచ్ఛ వైపు నడవాలనే ఏదో ఆర్తి నా హృదయ గహ్వరంనించి తొంగిచూస్తోంది. లేచాను. చంద్రుడు పూచిన మల్లెపువ్వులా వున్నాడు. ఋషిపుంగవుని జ్ఞానతేజస్సులా వెన్నెల ఆనందాన్ని తాకుతోంది.

గది విడచి బయటకు అడుగువేశాను. ఎక్కడికి? ఎందుకు? ఏమో! నాకే తెలీదు. ఎక్కడికో వెళ్ళాలి. ఏదో గ్రహించాలి అనుకున్నాను. ఎక్కువసేపు మేలుకుంటే రేపల్లా బాధపడతావు. త్వరగానే వచ్చేయి అన్నది మా అత్తయ్య. వెన్నెట్లో అడుగులు త్వరితంగా పడుతున్నాయి. నా కాళ్లు నన్ను ఎక్కడికని ప్రశ్నించే స్థితిలో లేవు. నన్ను నేను మరచిపోయాను. నా హృదయం ఆనందసాగర తరంగాల్లో తేలియాడుతోంది. అవధిలేని మహావిశ్వపు జ్ఞానమార్గంలో నేను నడుస్తున్నాను. బయటి వెలుగూ, లోపటి వెలుగూ నన్ను స్వప్నశిఖరాల్ని ముట్టిస్తున్నాయి. ప్రశాంతసుందరమైన చంద్రకిరణాలు లోకాన్ని ప్రక్షాళన చేస్తున్నట్టు అవుపించింది. ఆ విధంగా ఆరాత్రి చాలాసేపు తిరిగాను.

నేను ఎంతసేపు తిరిగానో నాకే తెలీదు. ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి, మా నాయనగారి సైకోషాలో ఒంటిగంట కొట్టింది.

ఇప్పుడు నన్ను అడుగుతారు, ఆరాత్రి నా పర్యటనలో ఏం చూశానని? ఏమో! చాలా చూశాను. ధనికుల భవనాలనించి పేదల పూరి గుడిసెల వరకూ చూశాను. ఊహాపథంలో శాంతి సామ్రాజ్యాల్ని సృష్టించే కళావేత్త మొదలు, నిత్యజీవితంలో దైనిక బాధల్ని వ్యక్తపరచే సామాన్య కర్షకుని వరకూ చూశాను. విలాసినుల గృహాల్లో వివాహాలకోసం కష్టవం తెచ్చే కన్నెరికపు ఆడపడుచుల మొదలు సనాతన సంసారకుటుంబాల్లో గోడలు దాటి పడనో రేళ్ల పసుపుకుంకుమ లేని బాలవిరహిణుల వరకూ చూశాను. ఇవన్నీ గ్రహించడానికి వెన్నెలే నాకు ఆధారపడింది. ఆ వెన్నెలే లేకపోతే నా మనస్సుకే అంధకారం, నా హృదయానికే అంధకారం, నా బ్రతుక్కే అంధకారం వచ్చి వుండును.

అయితే అంతేకాదు నేను చూసింది. సముద్రపుటొడ్డున కూర్చుని కూర్చుని యింటిదారి పట్టినప్పుడు బేకరీవాడు అప్పుడే కొట్టు మూస్తున్నాడు. ఆమలుపులోనే నేనొక అపరిచితుణ్ణి చూశాను. మాసిన గడ్డం, అడుగున పైజామా, పైన షేర్వాణీ, తలకు టోపీ, చాలా విచిత్రంగా వున్నాడు. ముందు ఆ నిర్జన ప్రదేశంలో వుండడంవల్ల 'వృత్తికి' సంబంధించిన వాడేమోనని నాలుగుదిక్కులూ కలయచూశాను. ఎక్కడేనా గాజుల రవరవలు వినపడతాయేమోనని చెవులు నిగిడించాను. ఆ జాడ ఏమీ కనుపించలేదు. అతన్ని దాటి రెండు అడుగులు ముందుకుపడ్డాయి.

'జనాబ్' అని పలకరించాడు.

'ఏం' అన్నాను.

'మీకు హిందీ వచ్చునా' అని యింగ్లీషులో ప్రశ్నించాడు.

'ఒక్క అక్షరం కూడా రాదు' అన్నాను యింగ్లీషులోనే.

'హాఁ హిఁ హిఁ' అని నవ్వాడు.

'ఏం నవ్వుతావేఁ' అన్నాను.

'దయవుంచి మీరెవరో చెపుతే, నేను నవ్విన కారణంచెపుతా' అన్నాడు తప్పుడుయింగ్లీషులో.

'నేను రచయితను' అన్నాను.

'ఏమైనా డబ్బు గణిస్తున్నారా' అన్నాడు.

'ఇంకా అంతవరకూ రాలేదు' అన్నాను.

ఈ మాట అంటూంటే అతని ముఖం వెల వెల పోయింది. అయితే యీ వెలవెలపాటుకి కారణం కొంతవరకూ నేనూహించాను. బహుశా అతను నన్నేదో ధన సహాయం కోసం ఆపి వుంటాడు. కాని నేను నా వృత్తివల్ల ఏమీ గణించడం లేదని చెప్పడంవల్ల అతనివ్యాసయం దెబ్బతిని వుంటుంది.

'అయితే మీరేదో చెపుతానన్నారు చెపుతారా?' అన్నాను నేను.

'దేశభాష అయిన హిందీని ఎందుకు నేర్చుకోరని?' అన్నాడు అతను.

'నేర్చుకోడానికి నాకు వ్యక్తిగతంగా అవసరం కనపడడం లేదు. నా గ్రామంలో అందరూ తెలుగే మాట్లాడతారు. హిందీ నేర్చుకొని నా కాలాన్ని పాడుచేసుకోడమే గాని, నాకు దాని వల్ల ఉపకారమేమీ లేదు. అందుకని' అన్నాను.

ఒక్కక్షణం నిశ్శబ్దం వహించాడు అపరిచితుడు. బహుశా నా మాటల్లో అతనికి సత్యం కనపడి ఉండవచ్చు. ఎవరి మాతృభాషని వారు గౌరవించుకుంటే చాలుననుకుని వుంటాడు. అతని మానముద్రలో హత్తుకుని. నేను దాన్నిగురించి ఆలోచించడమే మరచిపోయాను.

సిగరెట్ నోట్లో పెట్టి నిప్పు ముట్టించాడు. మీరు కూడా ఒకటి తీసుకోండి అన్నాడు. 'అలవాటు లే' దన్నాను.

'నా కో సహాయం కావాలి. చెయ్యగలరా?' అన్నాడు.

'మీరు అడగండి. నాకు వీలు కలిగినంత వరకూ ప్రయత్నిస్తాను' అన్నాను నేను.

అయితే నా కథ వినండి అని అతను ప్రారంభించాడు.

'మేం యిద్దరం అన్నదమ్ములం. నేను పెద్ద వాణ్ని. నా తరవాతివాడు యింకోడు. మా తల్లి తండ్రులు చిన్నతనంలోనే పోయారు. మాకు వెనకాల పిత్రార్జితపు ఆస్తిపాస్తులు ఏమీ లేవు, ఒక చిన్న యిల్లు తప్ప. ఆ యిల్లుకూడా ఆఖరైంది మేం పెద్దవాళ్ల మయ్యేసరికి. నాకు సుమారు యిరవయ్యో, వాడికి పంధొమ్మిదీ వయస్సు అప్పటికి. నాకు నాలుగు యింగ్లీషు ముక్కలబ్బేయి. వాడికి అవీ లేవు. చిన్నతనం నించీ ఏ చుట్టల దుకాణం మీదో, ఏ కాఫీ హోటలులోనో రెక్కలుకొట్టుకుని తెచ్చేవాడు. నేను ఏ మార్వాడీ కొట్టులోనో కూర్చుని, వాళ్లు చెప్పిన పనులు చేస్తూ, సాయంత్రం అయ్యేసరికి ఓ రూపాయో, అర్ధో తెచ్చేవాణ్ని.

మేమూ మానవులం కనుక మాకూ ఓ గదనేది వుండొద్దూ? విధి వైపరీత్యం అంతలోనే వుంది. ఏ యిల్లు మేం అమ్ముకున్నామో, ఆ యింట్లోనే ఓగది అద్దెకు తీసుకున్నాం. ఇద్దరం తెచ్చేది మాకు గటాగటీగా సరిపోయేది. ఎంతో చిరిగిపోతేకాని, ఓ చొక్కా కుట్టించుకుందికి వీలయ్యేదికాదు. ఇట్లో ఆడ సహాయం లేక పోవడంవల్ల మాకు విశ్రాంతి అనేది లేకపోయేది, ఓ పార్కు అనీ, ఓ సినీమా అనీ ఎల్లాగ?—

రోజులు దొర్లుతున్నాయి. మా రెక్కలు అమ్ముకుని, తద్వారా స్వేచ్ఛనించి విముక్తుల మయ్యామని తెలుసు. అయితే యేం, ఆవిధంగా నైనా మమ్మల్ని బ్రతకనిస్తే భగవంతుడికి మొక్కుకునే వాణ్ని. మాయదారి యుద్ధం వచ్చింది. ధరలు పెరిగి పోయాయి. మాకువచ్చే ఆదాయం చాలదు. అయినా అర్ధాకలితో అల్లాగే మూడు సంవత్సరాలు గెంటి వేశాము.

ఈ లోగా మరో రోకటి పోటు పడింది. మా తమ్ముడు ఆ రోజుల్లో ఓ మిల్లులో పని చేస్తున్నాడు. ఆమిల్లు యజమానికీ, పనివాళ్లకూ దెబ్బలాటలు వచ్చాయి. కండలు లేకపోయినా మా తమ్ముడు ఆత్మాభిమానంతో మాటలు విసి

రాడు. యజమాని ఆగ్రహంతో మా తమ్ముణ్ని జైలుకి పంపించాడు.

నిజం. మా తమ్ముడు ఆకలిమంటలవల్ల ఏవైనా మాటలు విసిరి వుండచ్చు. నేను కాదనను. మరి ధనికహృదయాల్లో ఔదార్యం ఏదీ? నాకు తల్లిదండ్రులు లేకపోతే లోటు కనిపించలేదు. ఇల్లు అమ్మేసుకున్నా లోటు కనిపించలేదు. కాని, సహోదరుడు నాతో లేకపోతే మాత్రం నాకు ప్రపంచమంతా చీకటి మయంగా తోచింది. నే నూరుకోలేక పోయాను ఎల్లాగేనా యీ ప్రపంచాన్ని దోచుకోవాలనిపించింది. దానివల్ల కాని నా కసితీరదని నా మనోవాంఛ. పోలీసుల యిళ్లల్లో దూరాను. మిల్లు యజమాని యింటిలో దూరాను. ఎన్నోసార్లు ఎన్నో విలువైన వస్తువులు దొంగిలించి పట్టుబడకుండా తప్పించుకున్నాను.

చివరకు అదీ తప్పింది కాదు. జైలుకు వెళ్లాను. జైలులో నేనా మాతమ్ముడితో కలిసి జీవించడం లభ్యమైనందుకు నే నెంతగానో సంతోషించాను. సంవత్సరాంతంలో మమ్మల్ని విడుదల చేశారు. మేం యివతలకు వచ్చాం. బందిఖానానించి బయటకు కదిలాం, బానిస శృంఖలాలనించి విముక్తులమయ్యాం. జైలు ఆవరణలోంచి ముందుకు నడిచాం. సంవత్సరం క్రితం నడిచిన నడిరోడ్డు మీద ముందుకు అడుగువేశాం.

'కాని నాకు ఒక్కటే అనుమానం మిగిలిపోయింది. మాకు నిజమైన స్వేచ్ఛ లభ్యమైందా అని. మేం యీ స్వాతంత్ర్యవాసనల్ని పీల్చగలమా? అంతా కల. ఎదుగున్న ప్రతిఒక్కడూ మా కళ్ళల్లోకి 'వీళ్ళు దొంగలురోయ్' అని చూసేవాడే. నేను అరుగు ఎక్కేసరికి మార్వాడీ భయంతో లోపలికి పారిపోయాడు. మానవత్వం లేని యజమాని మా తమ్ముడికి పని యిస్తాడా మళ్ళా పిలిచి? మాకు జీవితం మరీ దుర్భరమైపోయింది. ఎక్కడో కూరెక్కలు అమ్ముకుని చాలీ చాలని కూడుతో బ్రతకవలసిందే. కూలి పని చేద్దామా అంటే సంవత్సరంలో ఆరు నెలలు ఏ పని వుండదు పోనీ సోడా దుకాణం పెడితే డబ్బేదీ! మళ్ళా జైలుకు వెడితే!' అపరిచితుడు ఆగాడు.

నేను ఆలోచనలో పడ్డాను: కామ క్రోధ లోభ మద మాత్సర్యాల యినప కవచాల మధ్యని ఆత్మ బానిసత్వం అనుభవిస్తోంది. బాహ్యేంద్రియాల చాపల్యంలో పడి శరీరం బానిసత్వాన్ని అనుభవిస్తోంది. ఇంకా దూరం ఆలోచించాను. ఈ అపరిచితుని జీవిత కథ చాలా విషాదాంతమైనది. ఇతనొక్కడే కాదు. ఇతనిలాంటివాళ్లు నేటి సమాజపు నలుమూలలా వందలకొద్దీ వున్నారు. అయితే యీ బానిసల గమ్యస్థానం ఏది? నాకు తెగలేదు. నేను ఆగాను. అతను ప్రారంభించాడు.

'నేను దేనికీ బాధపడను. కాని మా తమ్ముడు యీ బానిస బ్రతుకు నించి విముక్తుడవడం కోసమై ఆత్మహత్యని ప్రతిపాదిస్తున్నాడు.' అతని కంఠం రుద్ధమైపోయింది. నిజానికి ఆత్మాభిమానం వున్న ప్రతి వక్కడూ, అల్లాంటి పరిస్థితిల్లో, యీ లోకం నించి తప్పుకోడానికే ప్రయత్నిస్తారు. లోకం వాళ్ళని నిష్కారణంగా ద్వేషిస్తుంది. మాటలతో, చూపులతో ఎగతాళి చేస్తుంది. నువ్వు మానవుడివి కావంటుంది. అందుకనే వాళ్ళు అభిమానాన్ని చంపుకోలేక, ప్రాణాన్ని తీసేసుకుంటారు. దానికికూడా ఒప్పుకోవు మన న్యాయ శాస్త్రాలు!

'అయితే యిప్పుడు నన్ను ఏం చెయ్యమంటారు? మీ వెంట వచ్చి, మీ తమ్ముడితో, ఆత్మహత్య కూడదని చెప్పమంటారా' అన్నాను,

అవునన్నాడు. ఇద్దరం వెళ్ళాం. వుంటా. నన్న చోట తమ్ముడు లేడు. అప్పుడే ఎక్కడికో వెళ్ళిపోయాడు. అతను కూలిపోయాడు. చాలా సేపు ఓదార్చాను. అతను ఏ పనీ చెయ్యకముందే నివారించమన్నాను. పాపం ఆ దుఃఖంలోనే ధైర్యాన్ని తెచ్చుకున్నాడు.

'సెలవు జనాబ్!' అని ఆ వెన్నెల్లో అదృశ్యుడయ్యాడు. ఏమైనా డబ్బు కావాలా అన్న నా వాక్యం అతనికి వినపడలేదు. ఆశ్చర్యం ఏమిటంటే అతని జీవితంలో అంత చక్కని మార్పు వస్తుందని నేను అనుకోలేదు. క్షణం క్రితం నాతో స్వేచ్ఛగా కష్టసుఖాల్ని గురించి మాట్లాడాడు. అతనే మరు క్షణంలో, ఆవేదనతో, బాధతో, ప్రేమతో, ఖంగారుతో, అశాంతితో తమ్ముణ్ని వెతకడానికై వెళ్ళిపోయాడు. ఏమో

ఏమవుతుందో! పర్యవసానం తరవాత ఎల్లాగా తెలుస్తుంది.

ఇదీ నేను చూసిన విషయం. లోకంలో ఆనాడు నాకిద్దరు బానిసలు కనుపించారు. ఒకణ్ని యింకొకడు రక్షించడానికి ప్రయత్నం చేస్తున్నాడు.

అంతవరకూ తెలుసుకుని యింటి దారిపట్టాను. వికసించిన వెన్నెట్లో నాకు త్రోవ ప్రస్ఫుటంగా కనపడింది. మళ్లా ఆ అపరిచితుణ్ని కలుసుకుందా మనుకుంటూనే నిద్రపోయాను.

తెల్లవారింది. ప్రొద్దున్న మొదలు సాయంత్రం వరకూ వాళ్లిద్దరికోసం పట్టణమంతా వెతికాను. వారిమీద వుండే ప్రేమకొద్దీ కాదు. బానిసల జీవిత పర్యవసానం ఏమవుతుందని! కాని వాళ్ళి ద్దరూ నాకెక్కడా కనుపించ లేదు. బహుశా వాళ్లెక్కడనుండి బయలుదేరి యీ స్వేచ్ఛ వైపు ప్రయాణం చేశారో, మళ్ళా అక్కడికే వాళ్ళు వెళ్ళిపోయి వుంటారు! జైలుకు! లేక ఏదైనా వుద్యోగం సంపాదించుకున్నారేమో! నాకు మాత్రం వేటికీ సమాధానం దొరకలేదు.

*　　　*　　　*

సాయంత్రం అత్త వెచ్చని అన్నం పెట్టింది. అది తిని గదిలోకి వచ్చి కూర్చున్నాను. అనంత మైన ఆలోచనలు నా మనస్సులో కోలాహలం ప్రారంభించాయి. అల్లా ఎంతోసేపు ఒంటరిగా కూర్చున్నాను. నాకు నిద్ర పట్టేసింది. మగతలో సైకోషాలో పెంద్యులం శబ్దం వినపడడం మానే సింది. ఆ ప్రశాంత సుందరమయిన వేళలో ఎవరో నన్ను పిలిచినట్లయింది నా మనస్సు లేచి వళ్లు విరుచుకుంది. నా ఆత్మ లేచి కూచుంది. మళ్లా అదే శబ్దం. 'ఎవరు, ఎవరు' అన్నది నా మనస్సు. మానవ కంఠస్వరంతో ఓ మూషికం 'నేను' అంది. పరకాయించి చూశాను. అది మాట్లాడింది మానవ కంఠ స్వరంతో కాదు. దాని అలవాటులో అది మాట్లాడింది. చర్మాల రంగుల్లోనూ, ఎముకల నిర్మాణంలోనూ వున్న విభేదాలవల్ల జీవకోటిలో భాషలు ఒకరిది మరొకరికి అర్థం కావేమో కాని, ఆత్మలకి అర్థం కాదూ? దాని భాష నా ఆత్మకీ, మనస్సుకి అర్థమైంది.

'నా అవసరం నీకేముంది? నేను రచయితను' అంది నా మనస్సు.

'రచయితవు కనకనే నిన్ను పలకరిస్తున్నాను. నీకు కొన్ని విషయాలు చెప్పదలచి వచ్చాను. వింటావా?' అన్నది ఆ మూషికం.

'నువ్వు దేన్నిగురించి చెపుతావు' అన్నది నా మనస్సు

'నీ ఆలోచనలకి సరిపోయేదే' అన్నది ఆ ఎలుక.

సరే అన్నది నామనస్సు. ప్రాణంలేని నీడల వెనకనించి, ఆత్మని మోసుకుపోయింది ఆ మూషికం.

వాతావరణం నిశ్శబ్దంగా వుంది. పౌర్ణమి కనక వెన్నెల పిండారబోసినట్లుంది. నాముందు ఎలుకా, ఎలుక వెనక నా ఆత్మా నిశ్శబ్దంగా నడుస్తున్నాయి. నడిచి నడిచి ఆ ఎలుక ఓ గోడ కంత దగ్గరకు తీసుకెళ్లింది. ఆ కలుగులో అంతా చీకటి మయంగా వుంది.

'పెద్దయ్యో పెద్దయ్యో' అని పిలిచింది ఆ ఎలుక.

ఓ ముసలి ఎలుక వచ్చింది. బొద్దుగా పెరిగివుంది.

'ఇతనే నా భర్త. మీరు మా కథని వింటే చాలా సంతోషిస్తున్నా' అన్నది ఎలకమ్మ.

'అందుకనేగా నే నిక్కడకు వచ్చింది. సిద్ధంగా వున్నాను' అంది నాఆత్మ. ఎలకమ్మ ప్రారంభించింది:

'ఈ గోడ కంతలో మేం అనాదినుంచీ నివసిస్తున్నాం. దూరంగా చూశారా, ఆ పెద్ద యిల్లు మా యజమానురాలుది. ఆమె చాలా దిట్టమైన మనిషి ఆమెకు బారసాలనాడు ఏం పేరు పెట్టారో తెలియదు కాని, మాకు జ్ఞానం వచ్చినప్పటినుంచీ ముసలమ్మనే పిలుస్తారు. ఆమెకు ఒక్కడే కొడుకు. చాలా అందమైన మనిషి. అతనంటే మాకు భక్తీ, ప్రేమా, భయమూకూడా వున్నాయి

మా కథ ఆ యింటిలోనే ప్రారంభమైంది. నాకు యౌవనం వచ్చేవరకూ జరిగిన విషయాలు మీకు చెప్పడం అవసరం లేదనుకుంటాను. కాని ఒక్కటిమాత్రం విపులీకరించడం ముఖ్యం. మమ్మల్ని చూసి మానవులు, జ్ఞానరహిత జీవా లుగా ఎంచి, ఎగతాళి చేసినా, మాకూ ఓ

హృదయమూ ఆత్మా, ఆలోచనా వున్నాయని మనవి చేస్తున్నాను.

నాకు చిన్నతనంనించీ పెద్ద ఎలుకయ్య మీదనే మోజు. అతనితోనే నా జీవితమంతా గడిపెయ్యాలని వుండేది. చివరకు అల్లాగే అయింది. ఇద్దరమూ కలిసే నేటివరకూ ప్రయాణం చేస్తున్నాము.

మా పగటి జీవితమంతా, యీ కలుగులోనే దొర్లిపోయేది. రాత్రిపడిందా, ముసలమ్మగారి కొట్టుగదిలో, నేనూ, పెద్దయ్యా ఎన్ని వస్తువులు తినేసే వాళ్లమో తెలీదు. ఒకమూల పప్పులూ, యింకోమూల పళ్లూ, మరోమూల పిండివంటలూ అన్నీ వుండేవి, ఆ రోజులు చాలా గొప్ప రోజులు. అన్నీ అతిచౌక. మేమూ చీకటిలో స్వేచ్ఛావిహారులం. మమ్మల్ని అనే వాళ్లెవరు?

కాని కాలమంతా ఒక రీతిగా గడుస్తుందా? జనన మరణాలూ, కష్ట సుఖాలూ, అల్లాగే సుభిక్ష దుర్భిక్షాలూను. ఎప్పుడో ఒకప్పుడు వాట్ల పరిభ్రమణం తప్పదు. ఎక్కడో మానవులు యుద్ధం చేసుకోవడం ప్రారంభించారు. ధరలన్నీ విపరీతంగా పెరిగిపోయాయి. మా ముసలమ్మగారి కొట్టు గదిలో సరుకులు పోగులు పడ్డం మానేశాయి దబ్బాలన్నిటికీ సీసాలన్నిటికీ బిరడాలు మొత్తంమీద ఆ మాయదారి యుద్ధం పేరుచెప్పి మా నోట్లో కరక్కాయ పడింది. ఏం తిందామన్నా దొరికేదికాదు. అంతకుపూర్వం మేంఎంత అల్లరిచేసినా వూరుకునే ముసలమ్మ, మేం కంటపడితే చాలు బెదిరించి అవతలకి తరిమేసేది. యుద్ధం పేరు చెప్పి దెబ్బ తినని వాళ్లెవరు?

ఈ సంధి సమయంలోనే మా జీవితంలో ఒక నూతన పాత్ర ప్రవేశించాడు. వాడే చిన్న ఎలకయ్య. ఎక్కడనుంచో వచ్చి మా ముసలమ్మగారింట్లో చేరాడు. ఎవరి గుణాశీలా మొట్టమొదటే ఎల్లా తెలుస్తాయి? మంచివాడనుకున్నాం. చేరనిచ్చాం. మాతో స్నేహం చేసినట్టే చేసి, యిక్కడే యింకో కలుగులో తిష్ఠవేశాడు. కొద్దిరోజుల్లో అన్ని గుణాలూ నేర్చుకున్నాడు. నాకేసి చూడడం మొదలెట్టాడు. ఏమిటో వెధవ చూపులు? నన్ను శృంగారంలోకి దింపుదామని!

మన కేమొచ్చిందిలే అని వూరుకున్నా ఈలోగా ముసలమ్మగారు యీ అలజడి అంతా కనిపెట్టింది. అబ్బాయిని పిలిచింది. ఈ ఎలుకలు మహా చెడ్డ వేధిస్తున్నాయి, ఓ బోను కొనుక్కురా అంది. ఇంకేముంది! అబ్బాయి కొనుక్కొచ్చాడు. మొదట్లో దాని నిర్మాణం మాకేమీ అర్థం కాలేదు. కాని ఇప్పుడో! దాన్ని తలచుకుంటేనే భయం వేస్తుంది. పరాయి శత్రువుకైనా అల్లాంటి నరకం వద్దు.

అంతే కాదు. అబ్బాయిగారు స్నేహితుని యింటికెళ్లి ఓ పిల్లిగార్ని తెచ్చారు. భేషుగా వుంది యీళని పేరగ కాలు అంత మంచిదనుకున్నాము. ఓమూల తినడానికే ఏమీ లేక పోతుంటే, బయట మాకు ఓ పెద్దపులీ, మరో సింహమూ కావలా!

ఇల్లా కొన్ని రోజులు జరిగాయి. చిన ఎలకయ్యకి పొగరు పట్టింది. ఏ భయం లేకుండా గర్వంగా రొమ్ము విరుచుని నడిచేవాడు. మేం మాత్రం, జీవితానుభవం వున్నవాళ్ళం కనక, ముందు వెనక లాలోచించి మరీ అడుగువేసే వాళ్లం. ఓ రోజున ముసలమ్మ గారి కొట్టు గదిలో మినపసున్ని పొట్లం కాజేసి, ఆ కైపులో చిన ఎలకయ్య నామీద పడ్డాడు. కామ ప్రభావం అంతగొప్పది. బరబరా వాడి కలుగు దగ్గరికి లాక్కుపోయాడు. చివరకు, నా శక్తి నంతా వినియోగించి, వాడితో పెనుగులాడి నా మానసంరక్షణ నేను చేసుకున్నాను. అయినా ఎందరి తప్పులెన్నైనా కనిపెట్టడానికి అనంతుడైన సృష్టికర్త వుండనే వున్నాడు పైన.

ఆ రోజు రాత్రే పిల్లిగాడు, మిరపకాయల డబ్బాపక్కని కూర్చుని, చిన్నయ్యని కాజేశాడు. అబ్బ! నే నిప్పుడు వర్ణించలేను. వాడి నోరంతా నెత్తురుమయం అయిపోయింది. ఆ సంఘటన చూడగానే నాలో వివిధ రకాల అనుభూతులు కలిగాయి. పిల్లిగాడు ఏరోజునైనా మనల్ని చంపగలడనే భయమూ, తోటివంశస్థుడొకడు చచ్చిపోయాడనే విచారమూ, క్రూరుడొకడు విరగడయ్యాడనే సంతోషమూను.

ఈ విషయం పెదయ్యతో చెప్పుదామని బయలుదేరాను. అడుగులో అడుగు వేసుకుంటూ నడిచాను. పెదయ్య ఎక్కడా కనపడలేదు.

అతను వుంటాడనుకున్న నాలుగుమూలలా వెదికాను. కాని అతని జాడ మాత్రం ఎక్కడా కనపడలేదు. ఎందువల్లనో నా పంచప్రాణాలూ ఎగిరిపోయినట్టనిపించింది. ఎవడు లేకపోతే నా జీవితం దుర్భరం అనుకుంటున్నానో, అతను, నా పెదయ్య నాకు కనపడలేదు, పిల్లిగాడి ధర్మమా అని, నోట్లో వేసేసుకున్నాడేమో నని భయం కలిగి గడగడ వణికిపోయాను.

ఈలోగా నా పెదయ్య నాకు కనుపించాడు. అమ్మయ్య బ్రతికాను అనుకున్నాను. దగ్గరకు వెళ్ళాను. అబ్బాయిగారు కొన్న యినప బంధిఖానాలో వున్నాడు.

'పెదయ్యా, వచ్చేయి' అన్నాను.

'ఏంరావడం నా మొఖం, దారి ఎక్కడా కనపడడం లేదు' అన్నాడు పెదయ్య.

'మరి ఎల్లా వెళ్లావు' అన్నాను.

'బుద్ధి గడ్డితింది. పకోడీకోసమని దిగాను ఆ దారమ్మట. నా దినాలు బాగులేక అది మూసుకుపోయింది. నువ్వు మాత్రం రాకుసుమా' అన్నాడు పెదయ్య.

'పోనీ యితతలనుంచే యీ తీగల్ని కొరికి చూస్తాను' అన్నాను.

'నీ ప్రేమకి కృతజ్ఞుణ్ని. నువ్వు నాకోసం కష్టపడకు. ఇవ్వాళతో నేను చచ్చిపోయా ననుకో. నువ్వు వెళ్ళిపో' అన్నాడు పెదయ్య.

మా గుసగుసలన్నీ విన్నాడో ఏమో, పిల్లిగాడు ప్రత్యక్షమయ్యాడు.

'ఏం చేస్తావు. వాడికంట పడకుండా వెళ్లిపో' అన్నాడు పెదయ్య.

'మరి నీ గతో' అన్నాను నేను.

'నన్ను వాడేమీ చెయ్యలేడు. నువ్వుమాత్రం వెళ్ళిపో' అన్నాడు పెదయ్య.

పిల్లిగాడు దగ్గరకు వచ్చేశాడు. నాకేమీ తోచలేదు. చర్రున తలుపుతోసుకుని పెదయ్య మీదపడ్డాను. భయంలేదంటూ పెదయ్య నన్ను తన కౌగిట్లోకి తీసుకున్నాడు. పిల్లిగాడు బోను చుట్టూ తిరిగి, నిస్పృహతో ఎక్కడికో వెళ్ళిపోయాడు.

ఈ కథ వింటూ బానిసలకి అక్కడే కూడా ప్రేమ ఒలికిందా అనుకుంటారు. భయంలోనే నిజమైన ఓదార్పు లభిస్తుంది ప్రేయసికి. దాని మాటకేంగాని, మా శక్తితో నిర్వహించలేని పని మామీదపడింది. మాకు తెలుసు. మేం ఆక్షణంలో కఠోర నరకంలో వున్నామని. స్వేచ్ఛని అరికట్టి యింకా మమ్మల్ని పదిరెట్లు బానిసలుగా చేశారని, మా చుట్టూవున్న యీ యినప సంకెళ్లు యింతలో తెగవని, మా బ్రతుక్కి స్వాతంత్ర్యం లేదని. నిరాశతో యింతేనా అనుకున్నాము. ఇందులోంచి వదిలారా, యింక ముసలమ్మగారు రమ్మని పిల్చినా రాకూడదనుకున్నాము. కానీ, చివరకు ఏమైందో మీకే తెలుస్తుంది.

ఇంతలో ఫెల్లున తెల్లవారింది. తెల్లవారుతూనే ముసలమ్మ మేం వున్న చోటికి వచ్చింది.

'పడ్డాయి వెధవలు - అబ్బాయీ, యీ వెధవల్ని ఎక్కడో దూరంగా వదిలెయ్యరా' అంది.

అబ్బాయి కోపంతో మా దగ్గరకు వచ్చాడు. చొక్కా తొడుక్కుందికి గదిలోకి వెళ్ళాడు. అక్కడ ఏం చూశాడో తెలీదు. చర్రున వంటింట్లోకి వచ్చాడు.

'అమ్మా! చిలకమ్మ పంజరంలో లేదు. నీకు కనిపించిందా?' అన్నాడు.

'లేదురా నాయనా' అంది ముసలమ్మ.

చిలకమ్మ కనపడలేదు.

ఇక్కడే చిలకమ్మని గురించి రెండుమాటలు చెప్పాలి. చిలకమ్మ ఎంతో అందమైన ప్రాణి. ఎర్రటి ముక్కూ పచ్చటి యీకలూ, ప్రపంచాన్ని మైమరపింపచేసే, ఆ చూపులూ ఎన్ని వున్నాయి! ఆమె నోటంట వచ్చే ప్రతి మాటా ఎంతో ముద్దుగా వుండేది. ప్రభాత సమయంలో ప్రతిరోజూ మేలుకొలుపులు పాడు పాడుతూంటే మాకు ఏవో దివ్యలోకాలు చూసి నట్టుండేది. మాతో పాటే చిన్నప్పట్నించీ ఆ యింట్లోనే పెరిగింది. అదే మమకారం ఆమె యందు మాకు.

అల్లాంటి చిలకమ్మ. ఏమైందో పాపం. అబ్బాయిగారు వెతికారు. గడ్డిమేటు పక్కని యీకలు కనిపించాయి. చిలకమ్మని ఎవడో కిరాతకుడు చంపివేశాడు. ఆయనలో కోపం పేరుకుపోయింది. కళ్లు జ్యోతుల్లా అయిపోయాయి. ఆలోచించాడు. స్ఫురించింది. చిలకమ్మని ఎవరు చంపి వుంటారో ఆయనకు అర్థ

మైంది. రాత్రి పంజరం తలుపు పొరపాటున తీసివుంది.

వెంటనే యిటికిబొంతతో పిల్లిగాణ్ని రూపు మాపారు అబ్బాయిగారు. చిన ఎలకయ్య యీ లోకాన్ని విడిచి ఎక్కడికి వెళ్లిపోయాడో, అక్కడికే పిల్లిగాడూ వెళ్లిపోయాడు. చిలకమ్మ వెళ్లి పోయింది. తర్వాత అబ్బాయిగారు మా బోనుని తీసుకు వెళ్లి బహిరంగంలో వూరికి దూరంగా వదిలేశారు. పైన గద్దలు ఎగురుతున్నాయి. నా కాశ్చర్యం ఏమిటంటే శని రోజులంటే అంతే. పిల్లిగాడినుంచీ, అబ్బాయిగారి యినప బంధిఖానా నించీ, తప్పించుకుని ఆ స్వేచ్ఛని అనుభవించ కలిగామా? పైన కళ్లతో పొడుస్తూ ఆ గ్రద్దలు! ఆ నరకాన్ని నేను వర్ణించ లేను.

ఇక్కడే నేను యిచ్చే సందేశాన్ని వినండి. పుట్టింది మొదలు చచ్చేవరకూ ఆ కలుగులోనే పెరిగాం. కలుగు అంటే మహాంధకారం. అక్కడే ఆ చీకటిలోనే, మా తిండి షేం సంపాదించుకోవాలి. అలాంటి నరకాలు దాటి బహిరంగంలో పడ్డాం. అక్కడ అంతా స్వేచ్ఛ. అంతా వెలుగు. అంతా గాలి. ఎక్కడ చూసినా స్వాతంత్ర్యం.

కాని ఆ స్వేచ్ఛా వాతావరణాన్ని యీ బానిసలు భరించలేక పోయారు. తిన్నగా గ్రద్దలకి కనిపించకుండా, చీకటి బాట్లోనే ప్రయాణంచేసి, తిరిగీ మా ముసలమ్మగారి చీకటి కోణానికే చేరుకున్నాం. ఎక్కడికి వెళ్ళకూడదనుకున్నామో, అక్కడికే వెళ్ళవలసివచ్చింది. బానిసలు స్వేచ్ఛను అనుభవించ లేరనే మా కథా పర్యవసానం మీకు బోధపడిందా?' అన్నది ఎలకమ్మ.

ఈ కథనంతా విని, నా ఆత్మ నా దగ్గరకు వచ్చి చేరుకుంది. గడియారంలో పెండ్యులం చేసే శబ్దం వినపడడం మొదలెట్టింది. కళ్ళు చికిలించి చూశాను. ఏదో అపూర్వ సందేశాన్ని గ్రహించినట్టుగా ఆనంద పారవశ్యంలో మునిగి పోయాను



ఇటీవల మద్రాసులో జరిగిన సోషలిస్టుపార్టీ మహాసభకి బర్మా సోషలిస్టుల శుభసందేశాన్ని తెలపడానికి అక్కడనుండి ప్రతినిధులు వచ్చారు. ఆ ప్రతినిధులతోపాటు అశోక మెహతా, కమలాదేవి ఛటోపాధ్యాయ, పై చిత్రంలో కానవగును.